క్లుప్తంగా

ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌కు సత్కారం



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: తెలుగు వారి పెద్ద పండగ మకర సంక్రాంతిని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ డైమండ్స్ ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించింది. మకర సంక్రాంతి పండగ విశిష్టతను రాజశేఖర్ తెలియజేస్తూ తెలుగు వారి పెద్ద పండగ మకర సంక్రాంతి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2025–26 ఏడాదికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ఆర్ నీరజ, కార్యదర్శి ఎస్. కామేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈవో సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

రౌడీషీటర్లకు బైండోవర్

డాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్లను సీఐ జి. దేముడుబాబు స్టేషన్‌కి పిలిపించి ఆదివారం బైండోవర్ చేయించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు గానీ, లా అండ్ ఆర్డర్‌కు ఆటంకం కల్గించే చర్యలు చేపట్టరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

అల్లిపురం: టౌన్ కొత్తరోడ్డులో సంక్రాంతి ముగ్గుల పోటీలు కోలాహలంగా జరిగాయి. సుమారు 350 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఆర్డీవో పాల్గొని బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి లక్ష్మీదేవికి రూ.50 వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ. 20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ ముగ్గులు మహిళల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

కేరళ చెరకుకు డిమాండ్



అక్కయ్యపాలెంలో కేరళ చెరకు అమ్మకాలు

సీతంపేట: కేరళ చెరకు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణంగా అనకాపల్లి నుంచి చెరకు గడలు తెచ్చి విక్రయిస్తుంటారు. సంక్రాంతి నుంచి పరసలు పూర్తి అయ్యే వరకు నగరంలో కేరళ చెరకు విక్రయాలు జరుగుతుంటాయి. అక్కయ్యపాలెం, సీతంపేట, నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతాల్లో కేరళ చెరకు విక్రయిస్తున్నారు.

పసందైన పతంగులు

సంక్రాంతి అంటే అందరిలోను క్రాంతి నింపే పెద్ద పండగ. కొత్త అల్లుళ్లు, కొంటె మరదళ్లు, డూడూ బసవన్నలు, ఇళ్ల ముందు రంగవల్లులు, పిండి వంటలతో ప్రతి ఇంటా సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతాయి. వీటన్నింటితో పాటు సంక్రాంతికి పెద్దవాళ్లకు కోడి పందాలు, ఎడ్ల పందాలతో పాటు చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ఆడుకునే ఆట పతంగులు ఎగురవేయటం. గాలిపటాలతో పెద్దవారు కూడా చిన్నపిల్లలైపోతారంటే అతిశయోక్తి కాదు. సంక్రాంతి రాకతో **దక్షిణలో గాలిపటాల సందడి మొదలైంది.**

- సంక్రాంతి వేళ జోరందుకున్న గాలిపటాల విక్రయాలు
- పతంగుల విక్రయ కేంద్రం అల్లిపురంలో సందడే సందడి
- చిన్నాపెద్దా అందరిలో పండగ జోష్



అల్లిపురంలో గాలిపటాల దుకాణం



సీతాకోక చిలుక ఆకారంలో గాలిపటం



గరుడ పక్షి ఆకారంలో..

అల్లిపురం: గాలిపటాల విక్రయాలంటే గుర్తుకు వచ్చేది మొదట అల్లిపురం అని చెప్పకోవచ్చు. సంక్రాంతి సెలవులు కూడా తోడవటంతో పిల్లలు రోజంతా గాలిపటాలతో కాలక్షేపం చేస్తారు. సెలబ్రిటీల ఫొటోలు, పక్షులు, జంతువుల వంటి వాటికి గిరాకీ పెరిగింది. మార్కెట్‌లో రూ.15 నుండి రూ.5 వేల వరకు గాలిపటాల అమ్మకాలు జరుపుతున్నారు.

గాలిపటాలకు ప్రఖ్యాతం అల్లిపురం..

గాలిపటాల వ్యాపారానికి పెట్టింది పేరు అల్లిపురం. ఇక్కడ గాంధీ బొమ్మ పక్క నుండి వెళ్లే కుమ్మరవీధి రోడ్డులో గాలిపటాల విక్రయాల షాపులు దర్శనమిస్తాయి. వీధిలో గాలిపటాలను అందంగా అలంకరించి ఉంచుతారు. ఈ వీధి నిత్యం కళకళలాడుతుంటుంది. ఇక్కడ రిటైల్, హోల్‌సేల్‌గా అమ్మకాలు జరుపుతారు. నగరంలో పెద్ద పెద్ద దుకాణాలకు ఇక్కడి నుండే సరఫరా చేస్తుంటారు. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాల వారు ఇక్కడి నుండే కొని పట్టుకెళ్తుంటారు.

ఇక్కడే గాలిపటాలు కొంటుంటాం



నా చిన్నప్పటి నుంచి ఇక్కడే గాలిపటాలు కొంటున్నాం. ఇక్కడ అన్ని రకాల గాలిపటాలు దొరుకుతాయి. ధరలు కూడా అందుబాటులోనే ఉంటాయి. నాతో పాటు మా పిల్లలు కూడా ఇక్కడికే వచ్చి గాలిపటాలు కొంటుంటారు. సంక్రాంతి పండగ సమయంలో అల్లిపురంలో గాలిపటాల వీధి సందడిగా ఉంటుంది. – శ్రీను, అల్లిపురం

వింత పేర్లు.. విచిత్రమైన ఆకృతులు..

యాంగ్రీబర్డ్, స్పైడర్‌మాన్, బటర్ ఫ్లై, అవేంజర్, క్లాత్ స్పెషల్ పతంగి, పొలిటికల్ లీడర్, సినిమా హీరో.. హీరోయిన్లు, కార్టూన్స్ వంటి 25 రకాల ఫ్యాన్సీ గాలి పటాలు, ప్లాస్టిక్, పేపర్, క్లాత్‌తో తయారయ్యే గాలిపటాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి.

చరక..

గాలి పటాలను ఎగుర వేసేందుకు చరక తప్పనిసరి. గాలిపటం పైకి వెళ్లిన తర్వాత దారం త్వరగా వదిలేందుకు, చుట్టేందుకు ఈ చరక ఉపయోగపడుతుంది. చరకను వెదురు కర్రతో తయారు చేస్తారు. మార్కెట్‌లో ప్లాస్టిక్, స్టీల్‌వి దొరుకుతున్నాయి. వీటి ధర రూ.20 నుండి రూ.500 వరకు తున్నాయి.

మాంజాలదే ముఖ్య భూమిక..

గాలిపటాలు ఎగురవేయడంలో మాంజాలదే ముఖ్య భూమిక. ఇవి 50 రకాల వరకు ఉన్నాయి. కానీ అందుబాటులో కొన్ని రకాలు మాత్రమే దొరుకుతున్నాయి. మోతీలాల్, టాంగూస్, బరెల్లి, టైగర్ స్పెషల్, డబుల్ బ్లేడ్, మెట్రో వంటి మాంజాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీటిని సోడా సీసపు పొడి, కలబంధ, బెండకాయ రసం, మైదా పిండితో పలు రంగుల్లో ప్రత్యేకంగా తయారు చేస్తారు.

ఆదరణ తగ్గింది..



సంక్రాంతి వచ్చిందంటే అన్ని వయసుల వారు గాలిపటాలు ఎగురవేస్తారు. విభిన్న ఆకృతుల్లో గాలిపటాలు లభ్యమవుతున్నాయి. కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, జంషెడ్‌పూర్, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుండి గాలిపటాలను దిగుమతి చేసుకుంటున్నాం. నగరంలో చాలా ప్రాంతాల్లో గాలిపటాల అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో ఇక్కడికి వచ్చే వారి సంఖ్య తగ్గింది.

–బొట్టా రమేష్, గాలిపటాల వ్యాపారి, అల్లిపురం

జాగ్రత్తలు పాటించాలి..

పిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా పరిశీలించాలి. ఆనందాన్ని నింపే పతంగులు ఎగురవేసే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు తప్పవు. భవనం పైకి ఎక్కి పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తుంటారు. ఆకాశంలో అందంగా ఎగురుతున్న గాలిపటంపైనే దృష్టి పెట్టి డాబాలపై తిరుగుతుంటారు. భవనంపై ప్రహరీ లేక పోయినా, ప్రహరీ చిన్నగా ఉన్న భవనాలపైకి పిల్లలను పంపకూడదు. అదే విధంగా విద్యుత్ తీగలకు చిక్కుకునే గాలిపటాలను తీసే ప్రయత్నం చేస్తే వారిని ఆపండి. లేకపోతే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. విశాలమైన ఖాళీ ప్రదేశంలో గాలిపటాలు ఎగురవేసుకోమని చెప్పాలి. తప్పనిసరి అయితే తల్లిదండ్రులు దగ్గర ఉండి గాలిపటాలను పిల్లలతో ఎగురవేయించటం ఉత్తమం.

షాపులు పెరిగాయి..



గతంలో అల్లిపురంలో మాత్రమే గాలిపటాలు దొరికేవి. మేము ఈ ప్రాంతంలో మూడు దశాబ్దాలుగా అమ్మకాలు జరుపుతున్నాం. సంక్రాంతి సమయంలో గాలిపటాలకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం చాలా షాపులు ప్రారంభం కావడంతో మాకు డిమాండ్ తగ్గింది. ప్లాస్టిక్ నిషేధంతో జీవీఎంసీ వారు ప్లాస్టిక్ గాలిపటాల అమ్మకాలు చేయవద్దని చెబుతున్నారు.

–బొట్టా కాశీ, గాలిపటాల వ్యాపారి, అల్లిపురం



గాలిపటం చూపిస్తున్న వ్యాపారి

వివేకానందుని ఆశయాలు స్ఫూర్తిదాయకం



వివేకానందునికి నివాళులు అర్పిస్తున్న పచ్చిరిపల్లి రాము తదితరులు



వివేకానందునికి నివాళులు అర్పిస్తున్న పాల శ్రీహరిరెడ్డి తదితరులు



వివేకానందునికి నివాళులు అర్పిస్తున్న విజయానందరెడ్డి తదితరులు



ఆశ్రమవాసులు, విద్యార్థులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ, నిర్వాహకులు

అల్లిపురం: ప్రపంచానికి ఆధ్యాత్మిక విలువలు చాటి చెప్పిన వ్యక్తి స్వామి వివేకానందుడు అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము అన్నారు. ఆయన మాటలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. వివేకానందుడి జయంతి సందర్భంగా ఆదివారం సౌత్ జైలురోడ్డులో గల వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు 33వ వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో వివేకానందునికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుని ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు నాయకులు, కార్యకర్తలు కణితి బ్రహ్మం, నీలాపు అయ్యప్పరెడ్డి, పి.శివ, హరిహరరెడ్డి, గంగ, రాజు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో..

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సౌత్ జైలురోడ్డులో గల వివేకానందుని విగ్రహం వద్ద వివేకానందుని జయంతి ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి నీలాపు విజయానందరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎస్.మధుకర్ జీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీవీఎన్ మాధవ్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని వివేకానందునికి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం గర్వపడే గొప్ప తత్వవేత్త, ఆధ్యాత్మిక నాయకుడు స్వామి వివేకానంద అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎన్‌పీఎస్ ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ద లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వామీ వివేకానంద స్వచ్ఛంద సంస్థలో..

వన్‌టౌన్‌లోని స్వామీ వివేకానంద ఆశ్రమంలో వివేకానందుని జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ పాల్గొని ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారికి బంగారు ఉంగరాలు బహూకరించారు. విద్యార్థులకు ప్లాంక్స్, ఆశ్రయం పొందుతున్న వారికి దుప్పట్లు అందజేశారు. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల తాతాజీ, గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సద్గురు సాయి కోచింగ్ సెంటర్‌లో..

డాబాగార్డెన్స్: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా టౌన్ కొత్తరోడ్డులోని పంజా జంక్షన్ సమీపాన గల శ్రీసద్గురు సాయి కోచింగ్ సెంటర్‌లో ఆదివారం యువజన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి మాట్లాడారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో జాతీయ యువజన దినోత్సవం ఎందుకు జరుపుకుంటారో యువతకు తెలిపారు. వివేకానందుని జీవితంలో జరిగిన కొన్ని విషయాలు యువతతో పంచుకున్నారు. ఆధ్యాత్మిక రత్న హరిభక్త్ పారాయణ్ మహంత్ మరడాన నాగేశ్వరరావు గురువు తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తే.. ఇల్లు జాగ్రత్త

వన్‌టౌన్ పోలీసుల హెచ్చరిక



ఫిషింగ్ హార్బర్ రోడ్డులో నైట్ పెట్రోలింగ్ పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ దేముడుబాబు

డాబాగార్డెన్స్: పండగలకు ఊళ్లు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని వన్‌టౌన్ పోలీసులు సూచిస్తున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి ఈ నాలుగైదు రోజులు వారి వారి గ్రామాలకు వెళ్లే వారు విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలంటున్నారు. ఇంటి ముందు గాని, సమీపంలో గానీ దొంగతనాలు జరిగినట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

పండగ వేళ అప్రమత్తం..

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల వారందరూ పండగ వేళ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా పేకాట, కోడిపందాలు, గొర్రెపోతు పందాలు, గుళ్ల ఆటలు ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. అలాంటి వారి గురించి 9440796019కి గానీ 0891–2563632 నంబరుకు గానీ తెలపాలన్నారు. పండగ సందర్భంగా వన్‌టౌన్ పోలీసులు రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచారు. రాత్రి 10 దాటిన తర్వాత ఎవరైనా అనవసరంగా రోడ్లపై తిరిగితే చర్యలు తప్పవంటు హెచ్చరికలు జారీ చేశారు.

ఇప్పటికే చర్యలు చేపట్టాం..



సంక్రాంతి పండగను పురస్కరించుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే అవగాహన కల్పించాం. రాత్రి వేళ అనవసరంగా తిరిగే వారిపై చర్యలు తప్పవు. ఇప్పటికే అటువంటి 20 మందిని పట్టుకున్నాం. ఊళ్లకు వెళ్లే వారు ఇంటి ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదు. ఎవరైనా పేకాటలు, కోడిపందాలు ఆడుతున్నట్టు మా దృష్టికి వస్తే చర్యలు తప్పవు.

– జి. దేముడుబాబు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్,

వైభవంగా నీరాటోత్సవం



అమ్మవారికి కుంకుమ పూజ చేయిస్తున్న అర్చకులు



కోలాటం ఆడుతున్న మహిళలు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 29వ రోజు కార్యక్రమంలో భాగంగా నీరాటోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా చేపట్టారు. తెల్లవారు జాము 5 గంటల నుంచి స్వామి వారికి తిరుప్పావై 29వ పాశురం విన్నవించుకున్నారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గోదాదేవి విగ్రహాలను ఏర్పాటు చేసి అమ్మవారికి పసుపు దంచడం, మంగళ స్నానాల సందర్భంగా మహిళలు భక్తి గీతాలు, ఆట పాటలు, కోలాటాలతో ఆకట్టుకున్నారు. భక్తుల గోవింద నామంతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం భక్తులకు అంతరాలయ దర్శనం, కల్యాణ మండపంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

గోల్డ్ మెడల్ విజేత డాక్టర్ బొమ్మకంటి



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌తో విజేత డాక్టర్ శ్రీ హర్ష

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల ఆర్థోపెడిక్ డిపార్టుమెంట్‌లో డాక్టర్ బొంతు నీలిమ మెమోరియల్ గోల్డ్ మెడల్ అండర్ గ్రాడ్యుయేషన్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఆధ్వర్యంలో పలువురు వైద్యుల పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షలో అనేక మంది వైద్య విద్యార్థులు పాల్గొనగా డాక్టర్ బొమ్మకంటి శ్రీహర్ష విజయం సాధించారు. డాక్టర్ నీలిమ పేరిట గోల్డ్ మెడల్‌ను ఆర్థోపెడిక్ వైద్యులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లోకనాథం, డాక్టర్ చంద్రశేఖర నాయుడు, డాక్టర్ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ డాక్టర్ రజనీకుమార్ పాల్గొన్నారు.

‘రాజుగారి దొంగలు’ చిత్ర యూనిట్ సందడి



చిత్రగీతం విడుదల చేస్తున్న యూనిట్ సభ్యులు

డాబాగార్డెన్స్: హిటాసో ఫిల్మ్ కంపెనీ బ్యానర్‌పై లిఖిత నడిమింటి సమర్పణలో నడిమింటి బంగారు నాయుడు నిర్మించిన ‘రాజు గారి దొంగలు’ చిత్ర యూనిట్ ఆదివారం విశాఖలో సందడి చేసింది. లోహిత్ కల్యాణ్, రాజేష్ కొంచాడ, జోషిత్ రాజ్‌కుమార్, కైలాష్ వేలాయుధన్, పూజా విశ్వేశ్వర్, టీవీ రామన్, ఆర్కే నాయుడు ప్రధాన పాత్రధారులుగా తెర కెక్కించిన మంచి ఎంటర్‌టైనర్ సినిమా రాజుగారి దొంగలు సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని చిత్ర దర్శకుడు లోకేష్ రనల్ హిటాసో కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా సినిమా టీం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవితంలో డబ్బు ప్రాధాన్యత తెలుపుతూ, నలుగురు స్నేహితుల మధ్య డబ్బు విషయంలో జరిగే పలు సంఘటనలతో చిత్రం ఉంటుందన్నారు. గేయ రచయిత భాస్కరభట్ల రచించిన పైసలేరా..పైసలేరా అనే పాటను సంక్రాంతి సందర్భంగా ఈ రోజు విడుదల చేశామన్నారు. త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించి, విజయవంత చేయాలని కోరారు.

కుటుంబం చెంతకు అభాగ్యురాలు

సీతమ్మధార: గుంటూరు జిల్లా తాడేపల్లి దరి కొత్తూరు గ్రామానికి చెందిన మోకా వేదవతి (37) గత 15 ఏళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతోంది. విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. కోలుకున్నాక పెళ్లి చేసుకోమని తల్లి ఒత్తిడి చేయడంతో ఇంటి నుంచి పారిపోయింది. 2022 నవంబర్‌లో ఈమెను వైజాగ్‌లో ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ చేసి నేరుగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. 4 నెలల పాటు చికిత్స పొందిన తర్వాత డిశ్చార్జి తీసుకుని జీవీఎంసీ మహిళా షెల్టర్‌లో రెండేళ్లు ఉంది. అనంతరం పూర్తిగా కోలుకోవడంతో తల్లి మోకా శివమ్మ, అన్న గోవిందరాజుకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

గురు బోధనలతో సంస్కరణలు



మాట్లాడుతున్న జగద్గురు పీఠం భౌగోళిక అధ్యక్షుడు గురుప్రసాద్

మహారాణిపేట: పరమ గురువుల ప్రబోధాలు భౌగోళికంగా సాధకులను సంస్కరిస్తున్నాయని, మాస్టర్ ఈకే, మాస్టర్ పార్వతీకుమార్ బోధనలు దేశ, విదేశాల వారికి ప్రబోధనం కలిగిస్తున్నాయని జగద్గురు పీఠం భౌగోళిక అధ్యక్షుడు కె. గురుప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన గురు పూజోత్సవాలలో నిర్వహించిన ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సభలో జగద్గురు పీఠం విదేశీ ప్రతినిధులు లుడ్జర్ (స్విట్జర్లాండ్), డాక్టర్ లౌరా (బార్సిలోనా), కరీనా (జర్మనీ), డాక్టర్ రోజా మిఖేల్,(స్పెయిన్) పొందిన ఆధ్యాత్మిక అనుభవాలను సభికులకు వివరించారు. మాస్టర్ సీవీవీ ప్రార్థన, యోగజీవనం, వేద సంప్రదాయానికి తాము ఆకర్షితులయ్యామన్నారు. వీరు భక్తితో గానం చేసిన ‘అశ్వినీ దేవతల స్తోత్రం’ సాధకులను విశేషంగా ఆకట్టుకుంది.

హానిమాన్ రచనలు హోమియోకు కరదీపికలు



మాట్లాడుతున్న డాక్టర్ కేఎస్ శాస్త్రి

మహారాణిపేట: డాక్టర్ హానిమన్ రచించిన ఆర్గనాన్ హోమియోకు మూల గ్రంథమని, డాక్టర్ కెంట్ రాసిన మెటీరియా మెడికా హోమియో వైద్యులు, విద్యార్థులకు కరదీపిక వంటిదని జగద్గురు పీఠం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి అన్నారు. అంకోసా సమావేశ మందిరంలో జగద్గురు పీఠం నిర్వహిస్తున్న 64వ గురుపూజోత్సవాలలో ఆదివారం నిర్వహించిన హోమియో గోష్ఠిలో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి. వి. రాఘవరావు (కాకినాడ), ఏయూ హోమియో వైద్యులు డాక్టర్ జి.ఎ. రామేశ్వర్, డాక్టర్ జె.చంద్రమోహన్ (నాగరకర్నూల్), డాక్టర్ పిడూరి రమణ తదితరులు పాల్గొన్నారు.